క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తలుపుల: మండలంలోని వేపమానిపేట సచివాలయం పరిధిలోని గంజివారిపల్లి గ్రామంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం' చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గిరిధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు స్పందన

కనగానపల్లి/బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ఆయా మండలాల తహసీల్దార్లు పీవీ రమణ, యుగేశ్వరి దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సర్పంచు చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్‌బీకే వద్ద నిర్వహించనున్న వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యాపారులతో సమావేశం రేపు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చే టెండర్లపై ఈనెల 10వ తేదీన అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఎం మైనుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహించే సీల్డు టెండర్ ఫారాల భర్తీ, డీడీ తీసే విధానంపై వివరిస్తామన్నారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వారు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫిరోజ్ అహ్మద్, అసిస్టెంట్ ఏఎంఓ అబ్దుల్ మాలిక్, నాయకులు అతావుల్లా, అబ్దుల్ వాజిద్, మహ్మద్ సమీవుల్లా పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి

తలుపుల: మండలంలోని గుండువారిపల్లి గ్రామంలో ఎస్‌ఐ మగ్బుల్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు ఇంటింటి సోదాలు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. గొడవలకు వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓడీ చెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప, ఎంపీపీ ఫర్వీన్ బాను ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత మండల శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.

పుట్టపర్తిలో రేపు..

పుట్టపర్తిఅర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్ కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

17న తెప్ప తిరునాల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: పంతులచెరువులో ఈనెల 17వ తేదీన ప్రారంభంకానున్న తెప్ప తిరునాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం పంతుల చెరువు వద్ద తెప్ప తిరునాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తెప్ప తిరునాలకు విచ్చేసే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి లక్ష్మీపతి యాదవ్, మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు వై.రమణారెడ్డి, కరీం, భాషఖాన్, ఆదినారాయణ రెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, బాలకృష్ణారెడ్డి, చిన్నప్పరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి తరలిన భక్తులు

ముదిగుబ్బ: గాండ్లవారిపల్లి, ముదిగుబ్బ తదితర గ్రామాల నుంచి సుమారు 400 మంది భక్తులు ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు బస్సుల్లో తరలివెళ్లారు.

శరవేగంగా..



బత్తలపల్లిలో పూర్తయిన సచివాలయ భవన నిర్మాణం

- ముమ్మరంగా సాగుతున్న సచివాలయాలు, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణం
- ఇప్పటికే 61 భవనాల నిర్మాణం పూర్తి
- త్వరలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు

పుట్టపర్తి అర్బన్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే అందించేందుకు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ఎన్ని ప్రభుత్వాలు మారినా మండల కార్యాలయాలకే సొంత భవనాలు లేక ఇబ్బందులు పడిన అధికారులకు గ్రామ సచివాయాల్లో పని చేసే ఉద్యోగులకు అధునాతనమైన, అన్ని సౌకర్యాలతో భవనాలు నిర్మిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ, పట్టణ సచివాలయాలకు సొంత భవనాలను నిర్మిస్తూ రూ.కోటి ఆస్తిని బహుమతిగా అందజేస్తున్నారు. జిల్లాలోనే పుట్టపర్తి నియోజకవర్గం ఆదర్శంగా నిలిచేలా శాశ్వత భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో రాబోవు కాలమంతా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రగతిని పరుగులు పెట్టించవచ్చు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పురోగతిలో ఉండగా ఇక డిజిటల్ లైబ్రరీలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వీటిలో పుట్టపర్తి నియోజకవర్గంలో 68 సచివాలయాలకు గాను 22, 61 ఆర్‌బీకేలకు గాను 24, 48 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు గాను 15 నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు రూ.17.5 లక్షలు, డిజిటల్ లైబ్రరీకి రూ.16 లక్షలు వ్యయం చేస్తున్నారు.

రూపురేఖలు మారుతున్న గ్రామాలు

గ్రామాల్లో ఎక్కడ చూసినా భవన నిర్మాణాలు చూపడుతూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లతో పాటు నాడు–నేడులో భాగంగా పాఠశాల భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలు, రోడ్ల నిర్మాలు చేపట్టడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఇందులో భాగంగా పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, కొత్తచెరువు మండల కేంద్రంలో మూడు, నల్లమాడ మండలంలో పాతబత్తలపల్లి, బుక్కపట్నం మండల కేంద్రంలో రెండు, బుచ్చయ్యగారిపల్లి తదితర 8 సచివాలయాలను ఇటీవల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు.

తాత్కాలిక భవనాల నుంచి శాశ్వత భవనాల్లోకి..

గతంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని 68 సచివాలయాల్లో అన్ని పంచాయతీ భవనాల్లో కార్యక్రమాలను, విధులను నిర్వర్తిస్తూ ఉండేవారు. తాత్కాలిక భవనాలకు మరమ్మతులు చేసుకుని సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం రూ.లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు పూర్తి చేయనుండటంతో శాశ్వత భవనాల్లోకి మారనున్నారు.

భవనాలు	మొత్తం	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
సచివాలయాలు	68	22	38
ఆర్బీకేలు	61	24	37
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	48	15	33

సౌకర్యవంతంగా ఉంది



గతంలో గ్రామంలోని ఒక పాత భవనాన్ని మరమ్మతుచేసుకుని అందులోనే సచివాలయం, ఆర్‌బీకే, వైద్యం అన్ని సేవలు అందించే వాళ్లం. ప్రస్తుతం విశాలమైన భవనాన్ని నిర్మించడంతో చాలా సౌకర్యవంతంగా ఉంది. భవనంతో పాటు ఫర్నిచర్, మరుగుదొడ్లు, అవగాహన తరగతుల నిర్వహణ, రికార్డులను భద్రపరుచుకునేందుకు ఏర్పాట్లు చేశారు. సచివాలయ వ్యవస్థ చాలా మంచి ఆలోచన. వీటిని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– అజయ్ భాస్కర్‌రెడ్డి, సెక్రెటరీ, జగరాజుపల్లి, పుట్టపర్తి మండలం

నిర్మాణాల పూర్తికి చర్యలు



ప్రస్తుతం 30 సచివాలయాలు, 24 ఆర్‌బీకేలు, 15 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 8 సచివాలయాలు ప్రారంభించడంతో సిబ్బంది అందులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండటంతో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఇంకా పలు భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డీఈఈ, పుట్టపర్తి

పేదలకు ఉచితంగా వైద్య సేవలు



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరిటౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు తీసుకురావాలనే లక్ష్యంతో అర్బన్ హెల్త్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి గ్రామంలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతంలో గల ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ సెంటర్ అందుబాటులోకి తీసుకువచ్చారని వెల్లడించారు. పట్టణ ప్రాంతం మున్సిపాలిటీకి సంబంధించి నాలుగు వైపులా నాలుగు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్న చిన్న జబ్బులతో పాటు, అవసరమైన రక్త పరీక్షలను అక్కడే నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో వైద్య సేవలను ఎలా భ్రష్టుపట్టించారో అందరికీ తెలుసన్నారు. గత ప్రభుత్వ హయాంలో 108, 104 సేవలు మూలన పడ్డాయన్నారు. నేడు జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత వాటికి పునర్జీవనం పోసి, డయల్ చేసిన 10 నిమిషాల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, డాక్టర్ తేజ్ కుమార్, వైస్ చైర్మన్ కొమ్మ గంగాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు గిరిజమ్మ, ఇస్మాయిల్, ఖాసీం, రాంప్రసాద్, మరళీ, ప్రణీత్‌రెడ్డి, ఆవుల స్వామి, కృపాకర్‌రెడ్డి, మహమ్మద్, టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి కుంట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కదిరి కుంట్లపల్లి సర్పంచ్ రజనీష్‌రెడ్డి, జైనుల్లా పాల్గొన్నారు.

పరామర్శ

తనకల్లు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మద్దిమడుగు వేమన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆదివారం కాలనీకి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు శ్రీనివాసులు, వాల్మీకి సుధాకర్, చంద్ర, తిమ్మయ్య, ఉత్తన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రెండోసారీ జగనే సీఎం



తాగునీటి బోరుకు పూజలు చేస్తున్న పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర రెడ్డి

నల్లమాడ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖరరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మండలంలోని కురుమాలలో గతంలో తాను మరమ్మతు చేయించిన తాగునీటి బోరుకు ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మళ్లీ ఆయనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతున్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను నెరవేర్చారన్నారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చక్రధర్‌రెడ్డి, నాయకులు కేశప్ప, హబీబుల్లా, గిరిజాపతి, రెడ్డెప్ప, రవిచంద్రారెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రచ్చ చేయడమే 'పచ్చ చొక్కాల' పని



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాండ్లపెంట: ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుండటంతో ఎలాగైనా తమ ఉనికిని కాపాడుకోవాలనే తాపత్రయంతో పచ్చ చొక్కా నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ తాతం జగన్మోహన్, పార్టీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మలమీదపల్లి పంచాయతీ కోటూరులో నీటి ఎద్దడి ఎక్కడా లేదు. అయితే ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెచ్చి తమ ఉనికి కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా రామాలయం వీధిలో టీడీపీ కన్వీనర్ ఇంటి వద్ద ఉన్న పైపులైన్ వారి అనుచరులతో ధ్వంసం చేయించారన్నారు. ఎమ్మెల్యేతో గొడవ పెట్టుకోవాలని ఉద్దేశంతో ఇలా చేశారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, ప్రతాపరెడ్డి, అమానుల్లా మండిపడ్డారు. గత టీడీపీ పాలనలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నప్పటికీ ఎంపీటీసీ కాని, జెడ్పీటీసీగా ఉన్న టీడీపీ కన్వీనర్ భార్య కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఎక్కడా కూడా నీటి ఎద్దడి తలెత్తలేదని తెలిపారు. అయితే కావాలనే పైపులైన్‌ను ధ్వంసం చేసి స్టార్టర్ మరమ్మతుకు వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కార్యక్రమాలకు ప్రజల నుంచి మద్దతు లేకపోవడంతో ఈనెల 5న తుమ్మల బైలు గ్రామంలో చిన్నారులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయించడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు ఇలాంటి చౌకబారు కార్యక్రమాలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎవరైనా పథకాలు అందలేదని చెబితే.. ఎమ్మెల్యే సిద్దారెడ్డి వెంటనే స్పందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు మానుకుని ప్రజల్లో విలువలు పెంచుకునే కార్యక్రమాలు చేయాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు. సమావేశంలో జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రా నాయక్, బూత్ కన్వీనర్ గజ్జల రవీంద్రా రెడ్డి, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇక్బాల్, నరసింహులు, మైను, అల్లాబకాష్, యూనస్, విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

బత్తలపల్లి: సంక్రాంతి పండుగంటూ కోడి పందేలు, జూదాలు నిర్వహించినా, అందుకు ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి తదితర గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. గతంలో వివిధ పందేల్లో పట్టుబడిన పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. న్యాయస్థానం పందేలకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు.

ఆపరేషన్లతో పేదలకు కంటి చూపు



దాతను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి ఆపరేషన్లతో నిరుపేదలకు కంటి చూపు తిరిగి వస్తోందని రోటరీక్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక కోట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్, దాతల సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటిచూపు తగ్గిన వారికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 187 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 114 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని బెంగళూరుకు తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేయిస్తామని రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు జయసింహ, నరేంద్రరెడ్డి, సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేశులు, శివయ్య పాల్గొన్నారు.

రబీ సాగుకు రైతన్న రెడీ



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న ఓ రైతు



వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

కనగానపల్లి/రామగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అప్పర్ పెన్నార్ (పేరూరు డ్యాం)కు నీరు చేరింది. సకాలంలో భారీ వర్షాలు కురిశాయి. బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. బీడు భూములు పైర్లవుతున్నాయి. కొన్నేళ్లుగా వర్షాభావంతో పంటలు సాగు చేసుకోలేక ఇబ్బంది పడిన రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. ఏటా రాప్తాడు నియోజవర్గంలో ఆరు వేల హెక్టార్లలో సాగు చేసేవారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 12 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. కనగానపల్లి మండలంలోనే 3 వేల హెక్టార్ల దాకా వేరుశనగ సాగయ్యింది. నియోజకవర్గ వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. మొత్తం 1100 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలుస్తోంది. వరి పంటతోపాటు ప్రత్యామ్నాయ, ఉద్యాన పంటలైన రాగి, జొన్న, సజ్జ, చీనీ, మామిడి, జామ, బొప్పాయి, దానిమ్మ పంటల సాగుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు.

ప్రశాంతంగా సాయి ఫ్రూడెంట్–2023

ప్రశాంతి నిలయం: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే లక్ష్యంతో సంస్కృతీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాయిప్రూడెంట్–2023 టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి వద్ద ఉన్న సంస్కృతీ కళాశాలలో నిర్వహించిన టెస్ట్‌కు శ్రీసత్యసాయి, అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం, ఉభయ గోదావరి, నెల్లూరు, చిత్తూరు, కర్ణాటకలోని వివిధ జిల్లాల నుంచి 5 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ టెస్ట్‌ను 3 షిఫ్టుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బీడుపల్లి విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ సెంథిల్ కుమార్,అకడమిక్ డాన్ డాక్టర్ బాలకోటేశ్వరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీ చెరువు: కొండకమర్ల పంచాయతీ పోలేవాండ్ల కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జనార్ధన్‌కు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. నెల వ్యవధిలోనే జనార్ధన్‌కు చెందిన రెండు పాడి ఆవులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో కొండమకర్లలోని వైఎస్సార్‌సీపీ నాయకులు తమవంతు సాయంగా రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు నిషార్ అహమ్మద్, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, సర్పంచ్ జగన్మోహన్ చౌదరి, లక్ష్మీనారాయణ రెడ్డి, చితంబర రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటనారాయణ, గోవర్ధన్‌రెడ్డి, సూర్యశేఖర్ రెడ్డి, వెంకటరాముడు, నరేంద్ర, కృష్ణానాయక్, రాజ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహానికి నివాళి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి సోమవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బుక్కపట్నం కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించనున్నట్లు బుక్కపట్నం మండల కన్వీనర్ సుధాకరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం బుక్కపట్నం 1, 2 సచివాలయాల వద్ద ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముద్రించిన నవరత్నాలు వార్షిక క్యాలెండర్లను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు.

జగన్ మరోమారు సీఎం కావాలని పూజలు



పాదయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

చెన్నేకొత్తపల్లి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని మేడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శబరిమలలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడాపురం సాయి ఆధ్వర్యంలో 30 మంది అయ్యప్ప మాలధారులు వైఎస్సార్‌సీపీ జెండాతో పంబ నుంచి శబరిమలకు పాదయాత్ర చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే మరో సారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వారు ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

కొత్తచెరువు: మండల పరిధిలోని తలమర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు మాధవరెడ్డి, పుల్లప్ప, పోతిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ రెడ్డి, రామచంద్ర, నాగిరెడ్డి, సునీత, మల్లమ్మ, సావిత్రమ్మ, బొంతు క్రిష్టారెడ్డి, పీఆర్టీయూ అనంతపురం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.